# నేటి నుంచి దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు

- ముస్తాబైన దేవాలయాలు
- పూర్తయిన ఏర్పాట్లు
- నేడు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్న అమ్మవారు

బొంరాస్‌పేట, అక్టోబర్ 14 : పల్లె, పట్టణాల్లో దేవిశరన్నవ రాత్రులు, బతుకమ్మ పండుగ సందడి ప్రారంభమైంది. ఎంగిలిపూల బతుకమ్మతో బతుకమ్మ ఉత్సవాలు శనివారమే ప్రారంభంకాగా, ఆదివారం నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఓవైపు ఆడపడుచుల బతుకమ్మ ఆటలు, కోలాటాలు, మరోవైపు భక్తిశ్రద్ధలతో నిర్వహించే నవరాత్రుల పూజలతో పది రోజుల పాటు జిల్లాలో సందడి, పండుగ వాతావరణం నెలకొననున్నది. నవరాత్రి ఉత్సవాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ పట్టణాలతో పాటు మండల



కేంద్రాలు, గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయనున్నారు. నవరాత్రుల్లో వివిధ రూపాల్లో దర్శనమిచ్చే దుర్గామాతకు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. నవరాత్రులు ముగిసిన మరుసటి రోజే దసరా పండుగను జరుపుకుంటారు.

**రోజొక్క రూపంలో దర్శనం..**

మొదటి రోజు ఆదివారం అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరిదేవిగా, రెండోరోజు గాయత్రీదేవి, మూడోరోజు అన్నపూర్ణదేవి, నాలుగోరోజు శ్రీమహాలక్ష్మి, ఐదోరోజు మహాచండీదేవి, ఆరవ రోజు సరస్వతీదేవి, ఏడోరోజు లలితా త్రిపుర సుందరిదేవి, ఎనిమిదో రోజు దుర్గామహాదేవిగా, సాయంత్రం మహిషాసురమర్ధిని, తొమ్మిదో రోజు రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు. నవరాత్రుల్లో వరుసగా పులిహోర, పెరుగన్నం, మినప వడలు, పాయసం, పులిహోర, బెల్లం పొంగలి, పాయసం, చెక్కర పొంగలి, కేసరి పూర్ణాలు, లడ్డూలను అమ్మవారికి నైవేద్యంగా భక్తులు సమర్పిస్తారు. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు, కుంకుమార్చనలు చేస్తారు.

**బొంరాస్‌పేట మండలంలో**

దసరా నవరాత్రి ఉత్సవాలకు బొంరాస్‌పేట మండలంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని దుర్గామాత దేవాలయంతో పాటు బొట్లవానితండా మారెమ్మ, పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయాలను ముస్తాబు చేశారు. తుంకిమెట్ల, మెట్లకుంట, లగచెర్ల, తదితర గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసి దుర్గామాతను ప్రతిష్ఠించి భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తారు. దేవాలయాలకు రంగులు వేసి శోభాయమానంగా తీర్చిదిద్దారు. మండల కేంద్రంలోని దుర్గామాత దేవాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఆలయాలు, మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దశమి రోజు దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. నవరాత్రులను ఘనంగా నిర్వహించడానికి భక్తులు అన్ని ఏర్పాట్లు చేశారు.



తుంకిమెట్లలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు ముస్తాబు చేసిన మండపం

## మర్పల్లి సర్వం సిద్ధం

మర్పల్లి, అక్టోబర్ 14 : మండల కేంద్రంతో పాటు పట్లూర్, పంచలింగాల్, సిరిపురం, కొంషెట్‌పల్లి తదితర గ్రామాల్లో విజయ దశమి దసరా, దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమాత విగ్రహ ప్రతిష్ఠాపనకు యువజన సంఘం సభ్యులు ఏర్పాట్లు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దుర్గమాత విగ్రహాలను కొనుగోలు చేసి ఆలయాల్లో ఉంచారు.





బీఆర్‌ఎస్‌లో చేరిన కొత్లాపూర్ నాయకులతో ఎమ్మెల్యే ఆనంద్

## ప్రజాసంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం

**ఎమ్మెల్యే ఆనంద్**

మర్పల్లి, అక్టోబర్ 14 : ప్రజాసంక్షేమమే బీఆర్‌ఎస్ ఎజెండా అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుంచి 50 మంది నాయకులు ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రాములు, నర్సింహారెడ్డి, నర్సింహులు, సంజీవులు, బుజంగం, రాములు, బీఎస్పీ పార్టీ నుంచి సురేశ్‌తో పాటు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మధుకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి రాచయ్య, యూత్ అధ్యక్షుడు మధుకర్, నాయకులు షఫీ, ప్రకాశ్ పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూలంగిసేవ

కొడంగల్, అక్టోబరు 14 : పట్టణంలో వెలసిన కలియుగ వరదుడు శ్రీ మహాలక్ష్మివేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని స్వామివారికి శనివారం అమావాస్య పూలంగి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారంతో ఆలయ అర్చకులు పంచామృతాలు, పరిమళ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించి తీరొక్క పూలతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

## మానవత్వం చాటుకున్న ఎస్సై

**గర్భిణిని సొంత వాహనంలో దవాఖానకు తరలింపు**
**పండంటి బాబుకు జన్మనిచ్చిన మహిళ**

బొంరాస్‌పేట, అక్టోబర్ 14 : అర్ధరాత్రి పురుటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని తన స్వంత వాహనంలో దవాఖానకు తరలించాడు బొంరాస్‌పేట ఎస్సై శంకర్. సమయానికి దవాఖానకు చేరడంతో మహిళ పండంటి మగబిడ్డకు జన్మినిచ్చింది. వివరాల్లోకి వెళితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అశోక్‌యాదవ్, రింకూ దంపతులు బతుకుదెరువు కోసం బొంరాస్‌పేటకు వలస వచ్చారు. ఎస్సై శంకర్ అద్దెకు ఉంటున్న ఇంటి పక్కనే వీరు కూడా ఉంటూ దినసరి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గర్భిణీ అయిన రింకూకు శుక్రవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో ఎక్కడికి వెళ్లాలో వారికి



దవాఖానలో గర్భిణీని చేర్పించిన ఎస్సై శంకర్

పాలుపోలేదు. ఏం చేయాలో తోచక ఎస్సైను ఆశ్రయించారు. వెంటనే ఎస్సై శంకర్ స్పందించి రింకూను తన సొంత కారులో కొడంగల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆపద సమయంలో తమకు ఎంతో సహాయం చేసిన ఎస్సై శంకర్‌కు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

## యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో చోరీ

కోట్‌పల్లి, అక్టోంబర్ 14 : యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో జరిగిన చోరీ జరిగిందని, త్వరలోనే కేసును ఛేదిస్తామని కోట్‌పల్లి ఎస్సై స్రవంతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ కి పాల్పడినట్లు శనివారం బ్యాంక్‌లో పని చేసే వాచ్‌మెన్ బిచ్చయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటుగా బ్యాంకుకు సెలవులు ఉండడంతో బ్యాంక్ మేనేజర్ యూపీకి వెళ్లడం జరిగిందని, ఆయన సోమవారం రాగానే ఏటీఎంలో ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా చోరీకి పాల్పడ్డవారిని గుర్తిస్తామని తెలిపారు. క్లూస్ టీం ద్వారా ఏటీఎం మిషన్‌పై ఉన్న వేలి ముద్రాలను సేకరించడం జరిగిందని ఎస్సై తెలిపారు.



## ఎన్నికల కోడ్‌పై రాజకీయ పార్టీలకు అవగాహన

దౌల్తాబాద్, అక్టోబర్ 14: మండల కేంద్రంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంసీసీపై పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, ఎంఐఎం పార్టీలకు చెందిన సర్పంచులకు రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎంసీసీ (మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సౌండ్‌బాక్స్‌లు, లౌడ్ స్పీకర్ల



రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కోసం పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ర్యాలీలు నిర్వహించే సమయంలో కటౌట్లు, ఫ్లెక్సీలు తదితర వాటిని పెట్టరాదని ఎస్ఐ తెలిపారు.

## శనైశ్చర ఆలయంలో పూజలు

మోమిన్‌పేట, అక్టోబర్ 14 : మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో వెలసిన శ్రీ శనైశ్చర ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శని అమావాస్య పురస్కరించుకొని ఉదయం 4 గంటల నుంచి రాత్రి వరకు భక్తులు స్వామివారికి తైలాభిషేకాలు, పూజలు చేశారు. హైదారాబాద్, వికారాబాద్, కర్ణాటక, తాండూరు, శంకర్‌పల్లి, జహీరాబాద్, చేవెళ్ల తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరిలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు, ఈవో నరేందర్ భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదాన ం చేశారు.



ఎన్కతలలో శనైశ్చర స్వామి

## ఘనంగా బతుకమ్మ సంబురాలు

కులకచర్ల, అక్టోబర్ 14 : కులకచర్ల మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మలను పేర్చి బతుకమ్మ సంబురాలను చేసుకున్నారు. బతుకమ్మ పాటలు, ఆటలతో సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ కరణం ప్రహ్లాద్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

